'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

మూడేసి ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడటం ఇది రెండోసారి

నాంచారయ్య మెరుగుమాల

వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలవడం కాంగ్రెస్ పార్టీకి ఆనవాయితీగా మారింది. ఇతర పార్టీలతో అధికారం పంచుకోకుండా చివరిసారిగా పూర్తి పదవీకాలం ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నడిపినది 1991-96 మధ్యకాలంలో. ఆ తర్వాత జరిగిన 1996 (140 సీట్లు) ఎన్నికలు, అనంతరం కాంగ్రెస్ ప్రతిపక్షంలోనే ఉండగా జరిగిన 1998 (141 సీట్లు), 1999 లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో వరుస ఓటములను మూటగట్టుకుంది. మళ్లీ పాతికేండ్లకు (2014, 2019 ఓటములతో కలిపి) 2024లో మూడు వరుస పరాజయాలను చవిచూడటం గమనార్హం.

సోనియాగాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేజిక్కించుకున్నాక జరిగిన 1999 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అప్పటికి అత్యంత తక్కువగా 114 సీట్లు సాధించింది. ఇలా మూడు వరుస ఎన్నికల్లో ఓడిపోయాక 2004లో కేవలం 145 సీట్లతో యూపీఏ పేరిట తొలిసారి సంకీర్ణ సర్కారుకు నాయకత్వం వహించింది. విజయవంతంగా పదేండ్లు పాలించింది. అయితే, 1996 నుంచి 2004 వరకు జరిగిన నాలుగు వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది 150 సీట్లలోపే అనే విషయం గమనార్హం. ప్రస్తుత బీజేపీ మాదిరిగానే దివంగత ప్రధాని పీవీ నరసింహారావు నాయకత్వంలోని ఈ గ్రాండ్ ఓల్డ్ పార్టీ (జీఓపీ) 1991 పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో దాదాపు 240 సీట్లు గెలుచుకుంది. మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ చాణక్యుడు పీవీ మరే ఇతర పార్టీకి కేంద్ర మంత్రివర్గంలో చోటు ఇవ్వలేదు. ఫిరాయింపుల ద్వారా కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో మెజారిటీని ఆయన సమకూర్చగలిగారు. ఆయన ఐదేండ్ల పాలన తర్వాత 1996 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ చవిచూసిన ఓటమి.. 1977 ఎమర్జెన్సీ ముగిసే సమయంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ దిగ్గజం ఇందిరాగాంధీ పరాజయాన్ని తలపించింది. భారత రాజ్యాంగాన్ని పక్కనబెట్టిన 19 నెలలకు జరిగిన ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ దక్కించుకున్నది 154 సీట్లు మాత్రమే. 1990ల నాటి పరాజయాల పరంపర వల్ల హస్తం పార్టీ ఎనిమిదేండ్లు కేంద్రంలో అధికారానికి దూరమైంది.

ముగ్గురు అధ్యక్షులు- మూడు పరాజయాలు: పైన ప్రస్తావించిన విషయాలను కాస్త వివరంగా గుర్తుచేసుకుంటే 1996, 1998, 1999 పార్లమెంటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వరుసగా పీవీ నరసింహారావు, సీతారామ్ కేసరీ, సోనియాగాంధీల నాయకత్వంలో ఎన్నికల బరిలో నిలిచింది. ఆ మూడుసార్లు కూడా 150లోపు సీట్లు సాధించి లోక్‌సభలో గుర్తింపు పొందిన ప్రతిపక్ష హోదాను దక్కించుకున్నది. అయితే నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందని పీవీ, కేసరి నేతృత్వంలో కాంగ్రెస్ నాశనమైపోతుందని భావించిన సీనియర్ నేతలు 1998 చివర్లో కలకత్తా మహాసభలో పార్టీ అధ్యక్ష పదవిని సోనియాకు అప్పగించారు. ఆమె పగ్గాలు చేపట్టిన ఏడాదిలోపే 1999 సెప్టెంబర్‌లో పార్లమెంటు మధ్యంతర ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాలుగోసారి చీలిపోయింది. శరద్ పవార్ నాయకత్వంలో ఎన్సీపీ ఏర్పడింది. ఈ చీలిక నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో పైన పేర్కొన్నట్టు సోనియా నాయకత్వంలో కాంగ్రెస్ బలం గతంలో ఎన్నడూ లేనంతగా 114 సీట్లకు దిగజారింది. కానీ, ఆమె అధ్యక్షురాలిగా ఉండగానే జరిగిన 2004 ఎన్నికల్లో ఆర్జేడీ, డీఎంకే, ఎన్సీపీ, ఎల్జేపీ వంటి మిత్రపక్షాల మద్దతుతో కాంగ్రెస్

145 సీట్లనే గెలుచుకున్నప్పటికీ అదొక ఘన విజయంగా మీడియా సహా అందరూ వర్ణించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ (138 సీట్లు) కంటే అధికంగా కాంగ్రెస్ గెలుచుకున్నది 7 స్థానాలేనన్న విషయం ఎన్డీయే ఓటమితో మరుగున పడిపోయింది. సోనియా హయాంలోనే కాంగ్రెస్ పార్టీ బలం లోక్‌సభలో కనిష్ట స్థాయికి అంతకుముందు 1999లో పడిపోగా, మళ్లీ పదేండ్లకు 2014లో మరోసారి మరింతగా దిగజారింది. 2014లో ఆ పార్టీ 44 సీట్లు మాత్రమే దక్కించుకుని ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. 1990ల్లో మూడు వరుస పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ చవిచూసిన ఓటమి 21 శతాబ్దం మొదటి పాతికేండ్లలో మరోసారి అత్యంత దారుణంగా ప్రత్యక్షమైంది. మొదటిసారి ఎదురైన ట్రిపుల్ పరాజయాల్లో కాంగ్రెస్ పార్టీకి మూడంకెల సీట్లు లభించాయి. 1996లో 140, 1998లో 141, 1999లో 114 సీట్లు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. కానీ, రెండోసారి ఎదురైన వరుస పరాజయాల్లో మాత్రం కాంగ్రెస్ బలం లోక్‌సభలో రెండంకెలకే పరిమితం కావడం ఆ పార్టీ శాశ్వత దిగజారుడుకు ప్రత్యక్ష నిదర్శనం. పూర్తి పదవీకాలం ముగిసిన తర్వాత జరిగిన 2014, 2019, 2024 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా 44, 52, 99 స్థానాలకు పరిమితం కావడం భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చెప్పుకోదగ్గ చారిత్రక వాస్తవం.

రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతీయ పక్షాలు తరచూ తలెత్తే ప్రత్యేక రాజకీయ పరిస్థితుల వల్ల కొన్ని పార్లమెంటు ఎన్నికల్లో అత్యంత తక్కువ సీట్లు గెలుపొందడం, తర్వాత వెంటనే జరిగే ఆయా రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఘన విజయాలు నమోదు చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఒడిశాలో జరిగిన జోడు ఎన్నికల్లో మొత్తం 21 లోక్‌సభ సీట్లలో ఒక్క సీటూ గెలవలేకపోయిన ప్రాంతీయ మాజీ పాలకపక్షం బిజూ జనతాదళ్ (బీజేడీ) 147 స్థానాలున్న ఒడిశా అసెంబ్లీలో 51 సీట్లు కైవసం చేసుకోగలిగింది. ఇవే ఎన్నికల్లో ఒకే ఒక్క ఎంపీ సీటు గెలిచిన కాంగ్రెస్ కేవలం 11 అసెంబ్లీ స్థానాలే దక్కించుకుంది.

ప్రాంతీయ పక్షాలు కోలుకున్న సందర్భాలే ఎక్కువ: తెలుగుబిడ్డ పీవీ పార్టీ అధ్యక్షునిగా ఉండగా ప్రకటించిన 1991 లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు సుమారుగా 240 సీట్లు రాగా, మళ్లీ ఆ పార్టీ డబల్ సెంచరీ దాటింది 2009 పార్లమెంటు ఎన్నికల్లోనే. కేంద్రంలో ఐదేండ్ల యూపీఏ పాలన తర్వాత కాంగ్రెస్‌కు 2009లో 206 సీట్లు దక్కాయి. అయితే, కాంగ్రెస్ బలం అత్యంత కీలకమైన పార్లమెంటు దిగువసభలో మళ్లీ కనిష్ఠ స్థాయికి దిగజారినా వరుసగా దాని బలం 44 నుంచి 52కు, అక్కడినుంచి 99 స్థానాలకు పెరగడం అత్యంత ఆరోగ్యకరమైన ఎదుగుదలగా కొందరు కాంగ్రెస్ నాయకులు దేశ రాజధానిలో గర్వంగా చెప్పుకోవడం విశేషం.

ఇక కాంగ్రెస్ విషయం పక్కనబెడితే, అనేక రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతీయ పక్షాలు తరచూ తలెత్తే ప్రత్యేక రాజకీయ పరిస్థితుల వల్ల కొన్ని పార్లమెంటు ఎన్నికల్లో అత్యంత తక్కువ సీట్లు గెలుపొందడం, తర్వాత వెంటనే జరిగే ఆయా రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఘన విజయాలు నమోదు చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఒడిశాలో జరిగిన జోడు ఎన్నికల్లో మొత్తం 21 లోక్‌సభ సీట్లలో ఒక్క సీటూ గెలవలేకపోయిన ప్రాంతీయ మాజీ పాలకపక్షం బిజూ జనతాదళ్ (బీజేడీ) 147 స్థానాలున్న ఒడిశా అసెంబ్లీలో 51 సీట్లు కైవసం చేసుకోగలిగింది. ఇవే ఎన్నికల్లో ఒకే ఒక్క ఎంపీ సీటు గెలిచిన కాంగ్రెస్ కేవలం 11 అసెంబ్లీ స్థానాలే దక్కించుకుంది. అలాగే 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీహార్ ప్రాంతీయ పక్షం ఆర్జేడీ రాష్ట్రంలోని 40 ఎంపీ స్థానాల్లో ఒక్క సీటూ సాధించలేకపోయింది. కానీ, ఏడాదిన్నర తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాలకు గానూ 80 సీట్లు కైవసం చేసుకుని శాసనసభలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఇలాంటి విలక్షణ ఫలితాలను వివిధ రాష్ట్రాల్లో స్వయంగా చూసిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై విడ్డూరమైన వ్యాఖ్యలతో తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకుంటున్నారు.

1990ల నాటి మూడు వరుస ఓటముల తర్వాత 2004లో 145 సీట్లతో సంకీర్ణ కూటమి ద్వారా కేంద్రంలో అధికారంలోకి వచ్చినట్టుగానే 2029 ఎన్నికల్లో గెలుపు ద్వారా హస్తిన పీఠం తిరిగి తమ సొంతం అవుతుందని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఏపీలో 2004లో 29, 2009లో 33 ఎంపీ సీట్లను కాంగ్రెస్ గెలుపొందడం అప్పట్లో రెండుసార్లు సంకీర్ణ సర్కారుకు నాయకత్వం వహించడానికి తోడ్పడింది. ఈ లెక్కన 19వ లోక్‌సభ ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి హస్తం పార్టీకి కనీసం 10 స్థానాలు కూడా వచ్చే అవకాశాలు లేవన్నది సుస్పష్టం. కాబట్టి ప్రధాని పీఠంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని చూడాలనుకుంటున్న తెలంగాణ సీఎం మహత్తర స్వప్నం కలగానే మిగిలిపోక తప్పదు.

'నీట్'గా టాప్ ఇచ్చేశారు!

ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దేశమంతా ఆసక్తిగా చూస్తున్న వేళ హడావుడిగా నీట్ -యూజీ 2024 ఫలితాలను ఎన్టీఏ విడుదల చేసింది. వాస్తవానికి నీట్ ఫలితాలను జూన్ 14న విడుదల చేయాల్సి ఉంది. ఎందుకో తెలియదు గానీ, 10 రోజుల ముందుగానే అంటే సరిగ్గా జూన్ 4న ఎన్టీఏ వీటిని విడుదల చేసేసింది. ఆ ఫలితాలను చూసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే 67 మంది విద్యార్థులకు ఆల్ ఇండియా నెంబర్ వన్ ర్యాంక్ రావడమే అందుకు కారణం.

భరత్ చౌహాన్

ఎన్నికల ఫలితాలపై ఉన్న ఆసక్తితో ఆరోజు వాటిపై ఎవరూ పెద్దగా దృష్టి సారించలేదు. కానీ, ఆ ఫలితాల్లో జరిగిన అవకతవకలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. గతంలో ఆల్ ఇండియా నెంబర్ వన్ ర్యాంకు ఇద్దరికి లేదా ముగ్గురికి మహా అయితే నలుగురికి వచ్చేది. కానీ, ఈసారి మాత్రం ఎన్నడూ లేని విధంగా 67 మంది టాపర్లే కావడం గమనార్హం. అందులోనూ ఒకే సెంటర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించడం ఒకింత ఆశ్చర్యానికి, అనుమానాలకు తావిస్తున్నది.

ఈ ఏడాది భారత్‌తో సహా 14 విదేశీ నగరాల్లోని 4 వేలకు పైగా పరీక్ష కేంద్రాల్లో నీట్ జరిగింది. 24.06 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 13,16, 268 (56.4 శాతం) మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. అయితే దేశవ్యాప్తంగా 550 మెడికల్ కాలేజీలు ఉండగా.. వాటిలో సుమారు 80 వేల సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో వైద్య విద్యకు డిమాండ్ ఎక్కువైంది. దేశ భవిష్యత్తును, లక్షల మంది విద్యార్థుల తలరాతను నిర్దేశించే పరీక్ష పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు కొంతమంది విద్యార్థులకు వచ్చిన మార్కులపై అనుమానాలు తలెత్తుతున్నాయి. సాధారణంగా నీట్‌లో 180 ప్రశ్నలుంటాయి. ఒక్కో సరైన ప్రశ్నకు నాలుగు మార్కుల చొప్పున మొత్తం 720 మార్కులకు పరీక్షను నిర్వహిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక నెగెటివ్ మార్క్ ఉంటుంది. ఇక్కడే అసలు వివాదం తలెత్తింది. కొంతమంది విద్యార్థులకు 720 మార్కులకు గానూ 719, 718 మార్కులు వచ్చాయి. ఇలా రావడమే అవకతవకలు జరిగాయనడానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. ఎందుకంటే 180 ప్రశ్నలకు గానూ ఓ విద్యార్థి 179 సరైన సమాధానాలను గుర్తిస్తే అతనికి 716 మార్కులు వస్తాయి.

ఆ విద్యార్థి 180వ జవాబును తప్పుగా గుర్తించినందుకు గానూ అతనికి వచ్చిన 716 మార్కుల నుంచి నెగెటివ్ విధానం మూలంగా ఒక మార్కును తగ్గించాలి. తద్వారా ఆ విద్యార్థికి 715 మార్కులు మాత్రమే రావాలి. కానీ, అందుకు విరుద్ధంగా కొంత మందికి 719, 718 మార్కులు రావడం అనుమానాస్పదమైంది. ఇది ఏ విధంగానూ సాధ్యపడదు.

ఈ వివాదంపై ఎన్టీఏ డైరెక్టర్ స్పందించిన తీరు హాస్యాస్పదంగా ఉన్నది. పరీక్ష నిర్వహించడంలో ఆలస్యం అయినందున వారికి గ్రేస్ మార్కులు కలిపామని పొంతనలేని సమాధానం ఇచ్చారు. ఒకవేళ పరీక్ష ఆలస్యంగా నిర్వహిస్తే.. విద్యార్థులు ఎంత సమయాన్ని నష్టపోయారో అంత సమయాన్ని అదనంగా కేటాయించాలి. అంతేకానీ గ్రేస్ మార్కులు కలుపుతారా? అసలు ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు కలిపారు? ఎవరెవరికి, ఎంత మేరకు కలిపారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

నీట్ పరీక్షకు సరిగ్గా ఐదు రోజుల ముందు బీహార్‌లో ప్రశ్నాపత్రం లీక్ అయిందనే వార్త రావడం కలకలం రేపింది. నలుగురిని పాట్నా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు కూడా. జవాబులతో కూడిన ప్రశ్నాపత్రాలను రూ.30-50 లక్షల చొప్పున 30 మంది విద్యార్థులకు అమ్మినట్టు పోలీసులు వెల్లడించారు. దీనిపై పలువురు సుప్రీంకోర్టు తలుపుతట్టారు. ఫలితాలు వెల్లడించకుండా స్టే విధించాలని కూడా కోరారు. కానీ, స్టే విధించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఇదే అదునుగా భావించిన ఎన్టీఏ హడావుడిగా ఫలితాలను విడుదల చేసేసింది. ఈ వివాదం రోజురోజుకు ముదురుతుండటంతో ఈ ఏడాది ప్రశ్నాపత్రం చాలా సులువుగా ఉందని, దానికి తోడు గ్రేస్ మార్కులు కలపడంతో చాలామంది టాప్ ర్యాంకులు సాధించారని చెప్పి ఎన్టీఏ డైరెక్టర్ చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారు.

ఈ లీకేజీ వివాదంతో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల వేళ విద్యార్థులతో కలిసి పరీక్షా పే చర్చ అంటూ హడావుడి చేసే ప్రధాని మోదీ దీనిపై కనీసం స్పందించడం లేదు. కనీసం సుప్రీం కోర్టు అయినా జోక్యం చేసుకోవాలి. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే దీనిపై విచారణ చేపట్టేలా చూడాలి. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. అదే విధంగా భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు, తప్పులు జరగకుండా చూడాలి. దాంతో పాటు ఈ పరీక్షను వెంటనే రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రజల్ని నిలబెట్టే చెట్టు కావాలి

నిలబడ్డ చెట్లన్నీ మనవి కావు
గాలి వీచేవేవో కాయలు కాసేవేవో
కనిపెట్టగలగాలి
నిలబడ్డ చెట్లన్నీ మనవి కావు
ఓట్లు అడుగుతున్న చెట్లన్నీ మనవి కావు

కొన్ని కూల్చేటివి ఉంటాయి
కొన్ని మధ్యలోనే అమ్ముడుపోయేటివి
ఉంటాయి
వాటంతటికవే కూలిపోయేటివి
ఉంటాయి
కొన్ని మన ప్రాణం తీసేటివి ఉంటాయి
మన రాజ్యాంగాన్ని మార్చేటివి
ఉంటాయి
ప్రజాస్వామ్యాన్ని బానిసను చేసేటివి
ఉంటాయి

సంతలో నకలివేవో నాణ్యతవేవో
నమ్మకానివేవో
వెండివేవో రాగివేవో గుర్తించినట్లు
దమ్మానికి చోటునిచ్చే చెట్టును గుర్తించండి
ఎప్పుడూ మోసపోవద్దు ఎప్పుడూ ఓడిపోవద్దు
ఒక్కసారైనా ప్రజలు గెలవాలి

ప్రతిసారి పెట్టుబడిదారుడే గెలుస్తున్నాడు
అవినీతిపరుడే శాసనమవుతున్నాడు
హంతకుడే కుర్చెక్కుతున్నాడు
దొంగనే ధర్మధ్వజమైతున్నాడు
నిలువునా ముంచేవాడే
మూల పురుషుడు అవుతున్నాడు
ఎప్పుడిట్లెందుకైతుందో
ప్రతిసారి మాట్లాడుతున్నాము
మాట్లాడుకుంటూనే ఉన్నాము
రాస్తూనే ఉన్నాము ఆడి పాడుతూనే ఉన్నాము
అయినా విఫలమవుతున్నాము
చైతన్యమంతా
చెట్టు కింద మొలువని మొక్కల్లా
మాయమవుతున్నాము
నిప్పల్లో ఎగతోయబడిపోతున్నాం
తడిలో మురిగిపోతున్నాము
ఎండలో వాడిపోతున్నాము
ఆలోచించండి ప్రజలారా విజ్ఞతతో
ఆలోచించండి!
రక్తాన్ని తాగుతున్న జలగలెవరు?
రక్తాన్ని దానం చేస్తున్న మానవులు ఎవరు?
చెరువును నింపుతున్నది ఎవరు?
చెరువులో ఇండ్లు కట్టుకుంటున్నదెవరు?
న్యాయానికి రోడ్డును వేస్తున్నది ఎవరు?
రోడ్డును తనింటికే మలుపుకున్నదెవరు?

చెట్లిప్పడుంటావి
చెట్లిప్పడూ పాడుతుంటావి
చెట్లిప్పడూ అభయమిస్తుంటాయి
మనల్ని గుర్తించే చెట్టును గుర్తుంచుకోవాలి
కూరాడును
ఎడంకాలితో తన్నే పాటకు చరమగీతం పాడాలి
బొడ్రాయిని నిలబెట్టినట్లు
ఊరును నిలిపే ప్రజా దరువుకే
గండదీపం మోయాలి

వనపట్ల సుబ్బయ్య
94927 65358

ఏకపక్షం, నిరంకుశమిక గతమే!

అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడ్డాయి. ముఖ్యంగా ఈ ఎన్నికలు విభిన్న భావాలున్న రెండు కూటముల మధ్య జరిగాయి. మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రచారం చేసిన మెజారిటీ 'హిందుత్వ'కు, రాహుల్‌గాంధీ నేతృత్వంలో 'ఇండియా' కూటమి ప్రచారం చేసిన రాజ్యాంగ పరిరక్షక, లౌకిక విలువలకు మధ్య జరిగిన సైద్ధాంతిక పోరాటంగానే ఈ ఎన్నికలను అభివర్ణించాలి. అయితే, 'చార్ సౌ పార్' అని మోదీ అనుకూల మీడియా, బీజేపీ ఊదరగొట్టినప్పటికీ ఫలితాలు మాత్రం అందుకు విరుద్ధంగా వచ్చాయి. మోదీతో పాటు బీజేపీని అవి నిరాశపరిచాయి. ఎందుకంటే గతానికి భిన్నంగా ఈసారి చంద్రబాబు, నితీష్ కుమార్‌లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గతంలో తీసుకున్నట్టుగా ఏకపక్ష, నిరంకుశ నిర్ణయాలు తీసుకోవడం ఇకపై సాధ్యపడదు. అంతే కాకుండా మోదీ స్వేచ్ఛకూ ఆంక్షలు విధించినట్టయింది.

డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్
98493 28496

నరేంద్ర మోదీ ఏకపక్ష, నియంతృత్వ విధానాలకు ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పారు. తామే గెలిచామని బీజేపీ చెప్పుకొంటున్నప్పటికీ ఇది నైతికంగా మోదీకి ఓటమిగానే భావించాలి. గత దశాబ్దకాలంగా మోదీ-బీజేపీ అనుసరించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాల పట్ల ప్రజలు ఆగ్రహాన్ని, అసంతృప్తిని, నిరసనను తమ ఓటు ద్వారా తెలుపుతూ స్పష్టమైన తీర్పు ఇచ్చారు.

రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, రిజర్వేషన్లు ఎత్తేస్తామని కొందరు బీజేపీ నాయకులు పదేపదే చెప్పటం, పౌరహక్కులపై దాడి, విపక్షాలపై అక్రమ కేసులు, మేధావులు, జర్నలిస్టులను జైలుపాలు చేయడం, కఠినమైన సెక్షన్లు బనాయించి వారికి బెయిల్ రాకుండా అడ్డుకోవడం లాంటి చర్యలను చూసి విసిగిపోయిన ప్రజలు తమ ఓటుతో బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పారు.

బీజేపీ నేతలు విస్తృతంగా ప్రచారం చేసిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే నేత' ప్రచారాన్ని దేశ ప్రజలు తిప్పికొట్టారు. మోదీ గతంలో చేసిన అనేక వాగ్దానాలు నీటి మీద రాతలయ్యాయి. అందుకే మోదీ గ్యారంటీలను ప్రజలు విశ్వసించలేదు. ముఖ్యంగా మొదటినుంచీ బీజేపీ బలంగా ఉన్న యూపీలో ఎన్నికల ఫలితాలు అందరినీ నివ్వెరపోయేలా చేశాయి. యూపీలోని వారణాసి నుంచే మోదీ పోటీ చేశారు. యోగి ఆదిత్యనాథ్ ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి. పైగా అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించామని బీజేపీ గొప్పగా ప్రచారం చేసుకున్నది. రామమందిర నిర్మాణ ప్రభావంతో హిందువుల ఓట్లన్నీ తమకే పడుతాయని కమలనాథులు ఆశలు పెట్టుకున్నారు. కానీ, అక్కడి ఓటర్లు బీజేపీకి గట్టి షాక్ ఇచ్చారు. అయోధ్య ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థిని ఓడించారు. ఇది బీజేపీ శ్రేణులకు మింగుడు పడటం లేదు.

ఇక ఇండియా కూటమి విషయానికి వస్తే.. భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లిన రాహుల్ గాంధీ.. రాజ్యాంగం మనుగడ, బీజేపీ మళ్లీ వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని విస్తృతంగా ప్రచారం చేశారు. దాంతో పాటు కులగణన చేస్తామని హామీ ఇవ్వడం కొంతమేర ఆ కూటమికి కలిసివచ్చింది.

బీజేపీ ప్రభుత్వం గత పదేండ్లుగా దేశ సంపదను అదానీ, అంబానీ లాంటి కుబేరులకు కట్టబెట్టింది. అదే సమయంలో దేశంలో పేదరికం, నిరుద్యోగం, ధరలు పెరిగాయి. అనేక అంతర్జాతీయ సూచీలలో భారత్ అట్టడుగున నిలిచింది. వీటిని ఇండియా కూటమి అస్త్రంగా మలుచుకున్నది.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 2014లో మోదీ వాగ్దానం చేశారు. ఆ లెక్కన గత పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు రావాలి. కానీ, అందుకు భిన్నంగా ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడంతో ఉన్న ఉద్యోగులు రోడ్డునపడ్డారు. అదే సమయంలో ప్రైవేటు రంగంలో ముఖ్యంగా ఐటీలో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. ఇవన్నీ బీజేపీకి ప్రతికూలంగా మారాయి.

మోదీ పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి. బిల్కిస్ బానో కేసులో నిందితులు, బ్రిజ్ భూషణ్ దర్జాగా తిరుగుతుండటం ప్రజల ఆగ్రహానికి కారణమైంది. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినా, అత్యాచారం చేసి, చంపేసినా మోదీ సర్కార్ పట్టించుకోలేదు. మణిపూర్ మంటల్లో బుగ్గి అవుతున్నా మోదీ మౌనం వహించారు. పార్లమెంట్‌లో చర్చ పెట్టకపోగా.. ప్రశ్నించిన విపక్షాలను చట్టసభ నుంచి సస్పెండ్ చేశారు. ఇలాంటి అనేక ప్రజా సమస్యలను ఇండియా కూటమి ప్రజల దృష్టికి తెచ్చింది. మరోవైపు మోదీ తన పదేండ్ల పాలనపై తీర్పు చెప్పాలని ప్రజలను కోరే సాహసం చేయలేదు. ప్రజా సమస్యలపై చర్చ సాగకుండా పక్కదారి పట్టించేందుకు మతం, మందిరం, మసీదులతో పాటు మటన్, మంగళసూత్రాల వంటివాటిని తెరమీదికి తెచ్చారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని మోదీ సర్కార్ ఎన్నడూ గుర్తించలేదు. ఒకే భాష, ఒకే సంస్కృతి పేరిట ప్రాంతీయ ప్రత్యేకతలను, వాటికి ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. అందుకే ప్రాంతీయ సంస్కృతులు, భిన్నత్వం, ప్రత్యేకతల ముందు మోదీ హవా సాగలేదు. తమిళనాడు, బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల ప్రజలు స్పష్టమైన తీర్పు చెప్పడమే అందుకు నిదర్శనం. ఏపీలో టీడీపీతో పొత్తు లేకపోతే బీజేపీకి ఆ రాష్ట్రంలో ప్రాతినిధ్యమే ఉండేది కాదు. కనీసం డిపాజిట్లు కూడా దక్కేవి కావు.

మొత్తంగా చెప్పాలంటే ఈ ఎన్నికల్లో మోదీ-బీజేపీ ఊహించినట్టుగా ఏదీ జరగలేదు. ప్రజలు 240 సీట్లకు బీజేపీ బలాన్ని కుదించారు. నితీశ్, చంద్రబాబుపై ఆధారపడేలా చేశారు. ఈ బంధం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. నితీష్‌కుమార్ నమ్మదగిన స్నేహితుడు కాదు. మోదీ ఒంటెత్తు పోకడలతో చంద్రబాబు గతంలో ఎన్డీయే నుంచి బయటికి వచ్చినవారే. చంద్రబాబు, నితీశ్‌లకు ముఖ్యమంత్రి పదవులే ముఖ్యం. రాష్ట్రంలో రాజకీయంగా తమకు ముప్పు వాటిల్లితే వారు ఎన్డీయేను వదులుకుంటారే తప్ప మోదీ కోసం తమ రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలిగించరు. వారిద్దరు మోదీని అన్ని విషయాల్లో గుడ్డిగా అనుసరించరు.

మోదీ, చంద్రబాబు, నితీష్‌ల బంధం భావస్వారూప్యం కలిగినది కాదు. వారి సిద్ధాంతాలు పరస్పర విరుద్ధమైనవి. మోదీ ముస్లింలకు, వారి రిజర్వేషన్లకు బద్ధ విరోధి. చంద్రబాబు ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇస్తానని ప్రకటించారు. నితీష్ కూడా ముస్లింల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తారు. ఈ పరస్పర విరుద్ధ పార్టీల మధ్య సయోధ్య ఎంతకాలం కొనసాగుతుందో కాలమే సమాధానం చెప్పుంది. ఏపీ, బీహార్ రాష్ట్రాలకు మోదీ సర్కార్ ప్రత్యేక హోదా ఇస్తుందా? ఆయా రాష్ట్రాల ప్రయోజనాలను ఏ మేరకు నెరవేరుస్తుందనే దానిపై ఈ సంకీర్ణ ప్రభుత్వ మనుగడ ఆధారపడి ఉంటుంది. వీరిలో ఎవరో ఒకరు కినుక వహించినా సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలుతుంది.

---

15 రోజులైనా ఉంటుందా?

*చార్ సౌ పార్ అంటూ మాట్లాడినవారు కనీసం సొంతంగా మెజారిటీ అయినా సాధించలేకపోయారు. కొన్నిసార్లు ప్రభుత్వాలు ఒక్కరోజు మాత్రమే ఉంటాయి. ఏం జరగదని మాత్రం అనుకోకండి. పరిస్థితులు మారకపోతాయా అని మేం వేచిచూస్తున్నాం. ఏదైనా